www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 3 మార్చి 2023



ప్రభుత్వ భూములను గుర్తించాలి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రభుత్వ భూములనుమ గుర్తించాలని కలెక్టర్ గిరిష తహశీల్దార్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో భూ సేకరణపై రాయచోటి నియోజకవర్గంలోని తహశీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుత రాయచోటి నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి డికెటి, ప్రభుత్వ భూములు గుర్తించి రెండు రోజుల లోపల తమకు రిపోర్టు పంపాలన్నారు. నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లి, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం మండలాలకు సంబంధించి సర్వే నెంబర్ల వారీగా గుట్టలు మినహా అందుబాటులో ఉన్న అనువైన భూములు గుర్తించాలని తెలిపారు. కార్యక్రమాన్ని తహసిల్దార్లు, సర్వేయర్లు సీరియస్‌గా తీసుకొని త్వరితగతిన భూ సేకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయ, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, రాయచోటి నియోజకవర్గంలోని తహశీల్దార్లు పాల్గొన్నారు.

'బండ' భారంపై పెల్లుబికిన నిరసన



కేంద్ర ప్రభుత్వం సామాన్య, మధ్య తరగతి ప్రజలు వాడే వంట గ్యాస్ ధరను అమాంతంగా పెంచేసింది. వంట సిలిండర్‌పై రూ.50, వాణిజ్య సిలిండర్‌పై రూ. 350 పెంచుతూ సామాన్యులపై బండ భారం మోపింది. దీంతో జిల్లాలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలు తమ నిరసనను తెలియజేశారు. కడప నగరంలో సిపిఎం ఆధ్వర్యంలో సిలిండర్లను చెత్త బండిలో వేసి ర్యాలీ చేపట్టి తమ నిరసనను తెలియజేశారు.

- సిలిండర్లను చెత్త బండిలో వేసి ఆందోళన
- వంట గ్యాస్ ధరల పెంపును వెంటనే రద్దు చేయాలి : సిపిఎం



జమ్మలమడుగు : నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

తక్షణమే రద్దు చేయాలి

కడప అర్బన్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను విపరీతంగా పెంచుతూ సామాన్య ప్రజానీకం మీద పెద్ద ఎత్తున భారాలను మోపుతోందని, తక్షణమే ఆ భారాలను రద్దు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ. రామమోహన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.ఎస్. సుబ్బమ్మ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న పూలే సర్కిల్‌లో గ్యాస్ ధరల పెంపు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వరుసగా గ్యాస్ ధరలను పెంచుకుంటూ పోతుందని విమర్శించారు. 2014, మార్చిలో రూ.410 ఉన్న సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1155 కు చేరిందని పేర్కొన్నారు. గృహ వినియోగానికి వాడే వంటగ్యాస్ మీద రూ.50, వాణిజ్య అవసరాలకు వినియోగించే వంటగ్యాస్ సిలిండర్ మీద రూ.350 భారం మోపడం సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒకవైపు గ్యాస్ ధరలను పెంచి మరోవైపు విమాన ఇంధన ధరలను నాలుగు శాతం తగ్గించడం ఎవరి ప్రయోజనాల కోసమని ప్రశ్నించారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుముఖం పట్టినా, మన దేశంలో ఎందుకు ధరలు పెంచుతున్నారో ప్రజానీకానికి బిజెపి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని వారన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, నగర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రారెడ్డి, ఫారుక్ హుస్సేన్, ఓబులేసు, ఎమ్మార్ నాయక్, షంషాద్, అన్వర్, షాకీర్, రాజమణి, కామేశ్వరమ్మ, రియాజ్, సాదిక్, ఆర్వే నగర్ శ్రీను, గోపాల కృష్ణయ్య, నారాయణ రెడ్డి, రమాదేవి, ప్రభాకర్, పండు, ఉదయ్, ఇమామ్ పాల్గొన్నారు.

కార్పొరేట్ కంపెనీల కోసమా? ప్రజల కోసమా?

జమ్మలమడుగు రూరల్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉండేది కార్పొరేట్ కంపెనీల ఆదాయం కోసమా ప్రజల సంక్షేమం కోసమా అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.మనోహర్ ప్రశ్నించారు. గురువారం స్థానిక పాత బస్టాండ్‌లో గ్యాస్ పెంపుదలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి రెండు కలిసి అనేక రూపాలలో ప్రజలపై భారాలు మోపుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా పనులను పెంచుతూ దుర్మార్గ చర్యలకు పాల్పడుతుందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక 16, 17 సార్లు గ్యాస్ ధరలు పెంచి సామాన్య మధ్యతరగతి వర్గాల నడ్డివిరుస్తున్నారన్నారు. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రజలను ఆదుకోకపోగా కార్పొరేట్ కంపెనీలకు ఆదాయం పెంచేలా చర్యలు తీసుకోవడం దారునమన్నారు. పనిచేశాయన్నారు. రాబోయే కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి శివ నారాయణ, నాయకులు వినయ్ కుమార్, డేవిడ్, ప్రసాద్ రెడ్డి, హాజీ, సుబ్రమణ్యం, ప్రభాకర్ పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు పెంచడం గర్హనీయం : తలసిరెడ్డి

వేంపల్లె : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ పై రూ 50, వాణిజ్య సిలిండర్ పై రూ 350 లు పెంచడం గర్హనీయమని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2014 ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నపుడు అంతర్జాతీయ మార్కెట్ లో ముడి చమురు ధర బ్యారెల్ 114 డాలర్లు ఉన్నప్పుడు ప్రజలకు వంట గ్యాస్ సిలిండర్ ను రూ 410 లకు సరఫరా చేసిందని చెప్పారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 90 డాలర్లే ఉన్నప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధరను దాదాపు రూ 1200 చేయడం శోచనీయమని అన్నారు. గృహిణులు వంట గదిలోకి పోవాలంటే భయపడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ పాలనలో అచ్చే దిన్ కు బదులు చచ్చే దినాలు దాపురించాయని తెలిపారు. సబ్ కా వికాస్ బదులు సబ్ కా వినాస్ జరుగుతుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500 లకే వంట గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తుందని తులసిరెడ్డి అన్నారు.

ప్రజా సంక్షేమం గాలికి : టిడిపి

కడప అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశాయని, పెరిగిన గ్యాస్ ధరలపై టిడిపి జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి మండిపడ్డారు. టిడిపి జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014లో వంటింటి గ్యాస్ రూ, 415 రూపాయలు ఉన్న గ్యాస్ ధర నేటికీ మూడింతలు, వాణిజ్య వినియోగ గ్యాస్ ఏకంగా సిలిండర్ పై రూ, 300 పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలపై ఈ ప్రభుత్వాలు బాదుడే బాదుడుకు సిద్ధపడ్డాయని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై విరుచుకుపడ్డారు. ఏపీలో డీజిల్ ధరలకు, పొరుగు రాష్ట్రాల్లో డీజిల్ ధరలకు చాలా వ్యత్యాసం ఉండడంతో వాహనదారులు అక్కడి డీజల్‌ను వాహనాలకు వినియోగిస్తున్నారని అన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల తయారీ కాంట్రాక్టర్లను కుబేరులను చేస్తూ ఈ ప్రభుత్వం వినియోగదారులను దోపిడీ చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ వినియోగం ఎక్కువ పేరుతో రేషన్ కార్డులు తొలగిస్తూ, రేషన్ కార్డు లేదని పింఛన్ తొలగించడం ఈ ప్రభుత్వ దుర్మార్గానికి నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ప్రయోజనాలు పక్కన పెట్టి, పెంచిన గ్యాస్ త్వరలో పూర్తిస్థాయిలో తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్, నగర అధ్యక్షుడు శివకొండ రెడ్డి, ఆమూరి బాలరాజు, అమీర్, హరి పాల్గొన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను విపరీతంగా పెంచుతూ సామాన్య ప్రజానీకం మీద పెద్ద ఎత్తున భారాలు మోపుతుందని, తక్షణమే ఆ భారాలను రద్దు చేయాలని బిఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జిగురప్ప డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం : కలెక్టర్

ప్రజాశక్తి రాయచోటి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బాల్యవివాహాలు నిర్వహిస్తే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కలెక్టర్ గిరీష పిఎస్ సంబందితాధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై జిల్లా స్థాయి కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎఎస్‌పి డాక్టర్ రాజ్‌కమల్, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, రాయచోటి మదనపల్లె ఆర్‌డిఒలు రంగస్వామి, మురళి, ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాల్య వివాహాలను ప్రోత్సహించే ఎంతటి వారినైనా సహించేది లేదని హెచ్చరించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిర్మూలనకు టోల్ ఫ్రీ నెంబర్ 1098 కు ఫోన్ చేసి సహకరించాలన్నారు. సచివాలయాల పరిధిలోని మహిళా పోలీసులు, పంచాయతీ సెక్రటరీలు, ఏఎన్ఎంలు, బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా ఎన్జీవోలు బాల్య వివాహాలు అధికంగా జరిగే ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పించి వివాహం చేసుకోబోయే అమ్మాయిలకు అబ్బాయిలకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. మన దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయినప్పటికీ ఇంకా బాల్య వివాహాలు జరగడం చాలా బాధాకరమన్నారు. బాల్య వివాహాల వల్ల అమ్మాయి, అబ్బాయి జీవితం నాశనం అవుతుందని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. చాలా పాఠశాలల్లో కేవలం పెళ్లి కోసమే అమ్మాయిలు డ్రాప్ అవుట్ అవుతుంటారని, డ్రాప్ అవుట్ లిస్టుపై ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆర్డీవోలు, తహశీల్దార్, ఎంపిడిఒలు, ఐసిడిఎస్, వైద్యాధికారులు, విద్యాశాఖాధికారులు సమన్వయంతో ప్రతినెలా క్రమం తప్పక డివిజన్, మండల, గ్రామ స్థాయిల్లో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. అనంతరం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ తెలిసీ తెలియని చిన్న వయసులో బాలికలు వివాహం చేసుకోవడం జీవితంలో ఎదుగుదలకు ఎన్నో రకాలుగా అవరోధం కలిగిస్తుందన్నారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు 21 సంవత్సరాలలోపు అబ్బాయికి వివాహం చేస్తే పెళ్లి కుమారునికి, వారి తల్లిదండ్రులకు పెళ్లిలో పాల్గొన్న వారికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఇది బెయిలు లభించని నేరమన్నారు. మైనర్ బాలికను వివాహం చేసుకొని తనతో సంసారం చేసిన భర్తకు ఫోక్సో చట్టం కింద 10 సంవత్సరాలు జైలు శిక్ష కూడా విధించవచ్చునన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలి : సిపిఎం



మట్టి తరలింపు పనులను అడ్డుకున్న పేదలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి-తిరుపతి జాతీయ రహదారికి కోసం మట్టిని కోసం అనుమతులు తీసుకొని పేదల భూములను ఆక్రమించుకున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మండలంలో భూ కబ్జాలు అరికట్టడంలో విఫలమైన మదనపల్లె తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గురువారం మదనపల్లి-తిరుపతి జాతీయ రహదారి పక్కన ఉన్న బసినికొండ రెవెన్యూ గ్రామం సర్వేనెంబర్ 1130లో ఉన్న పేదల భూములను ఆక్రమించుకున్న కాంట్రాక్టర్ మట్టిని తరలిస్తూ రహదారికి వాడుకోవడమే కాకుండా ప్రయివేట్ వ్యక్తులకు అమ్ముకుంటు ఉండటాన్ని గమనించిన సిపిఎం నేతలు స్థానిక పేదలతో కలిసి పనులను అడ్డుకున్నారు. హిటాచి, జెసిబి, టిప్పర్లను అడ్డుకుని అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ 987 సర్వే నంబర్లో అనుమతులు తీసుకున్న హైవే కాంట్రాక్టర్ 1130 సర్వే నెంబర్లో పేదల పేర్లతో ప్రభుత్వం మంజూరు చేసిన భూములను ఆక్రమించుకుంటున్నారని విమర్శించారు. పేదలకు పట్టాలు ఉండి ప్రభుత్వ సౌకర్యాలు అన్ని పొందుతున్నారని, విత్తనాలు మంజూరు చేయడం రైతు భరోసా పొందడం జరుగుతున్న సరే వారికి కనీసం సమాచారం కూడా ఇవ్వకుండా భూములను ఆక్రమించుకోవడమే కాకుండా, మట్టిని తవ్వుకొని అక్రమంగా తరలించడానికి ప్రశ్నించాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూడడమే కాకుండా, కబ్జాదారులకు అండగా నిలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మదనపల్లి మండలంలో వాగులు, వంకలు, కుంటలు, చెరువులు, పేదల భూములు, ప్రభుత్వ భూములు అన్నీ కబ్జాకు గురవుతున్నా కూడా రెవెన్యూ అధికారుల్లో స్పందన కరువైందని అన్నారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని కబ్జాలపైన సమగ్ర విచారణ జరపాలని, కబ్జాలకు బాధ్యత వహిస్తూ తహశీల్దారును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు న్యాయం చేయకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సంఘటన స్థలానికి చేరుకున్న తహశీల్దార్ సికె.శ్రీనివాసులు మాట్లాడుతూ పేదల భూములకు ఎలాంటి నష్టం చేకూర్చమని ఇప్పటిదాకా జరిగిన నష్టానికి కాంట్రాక్టర్ నుంచి భూములు చదును చేయించి, నష్టపరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కాంట్రాక్టర్ కు కేటాయించిన భూముల్లోనే మట్టి ఎత్తుకోవాలని పేదల భూములకు జోలికి రాకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి.ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కృష్ణప్ప, మురళి స్థానికంగా ఉన్న పేదలు పాల్గొన్నారు.

కుమార్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం : మంత్రి పెద్దిరెడ్డి

వాల్మీకిపురం: తొలితరం సినిమా థియేటర్ యజమాని మొర్రంరెడ్డి కుమార్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక సీతారాం థియేటర్‌లో కుమార్‌రెడ్డి సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, నవాజ్‌బాషా, ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డి, రాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం రామ్‌కుమార్‌రెడ్డి, శ్యామ్ కుమార్‌రెడ్డిలను పరామర్శించారు.



బంతి పూల తోటను పరిశీలిస్తున్న యశోదమ్మ

'పథకాలు సంతృప్తి స్థాయిలో అందాలి'

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలని చీఫ్ సెక్రటరీ డా.జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి హౌసింగ్, రెవెన్యూ, అగ్రికల్చర్, హార్టికల్చర్, సీరికల్చర్, అనిమల్ హస్బండరీ, డైరీ డెవలప్మెంట్, పిఆర్ అండ్ ఆర్‌డి, వివిధ ప్రభుత్వ పథకాల అమలు పై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హల్ నుండి జిల్లా కలెక్టర్ గిరీష, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ, జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరగాలన్నారు. పభుత్వం అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలనే లక్ష్యం మేరకు అధికారులు నిబద్ధత, బాధ్యతతో పని చేయాలని ఆదేశించారు. జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ముమ్మరంగా జరగాలని అధికారులను ఆదేశించారు. రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి ఇకెవైసి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు సకాలంలో బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ బిల్డింగులు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. జల్ జీవన్ మిషన్ పైన ప్రత్యేక దృష్టి పెట్టి ఆ పనులను పూర్తి చేయాలన్నారు. గ్రామ సచివాలయాలు, ఆర్‌బికె, హెల్త్ క్లినిక్‌లు స్టేజ్ కన్వర్షన్ మీద ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ లక్ష్యమైతే నిర్ణయించిందో, ఆ లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. చేసిన పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు బిల్లులు అప్లోడ్ చేయాలన్నారు.

రేపు హజ్రత్ సయ్యద్ యూసుఫ్ షాఖాదిరి ఉరుసు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలోని బండ్లపెంటలో వెలసిన యూసుఫ్ షాఖాదిరి (దివానే సాహెబ్) శుక్రవారం గంధం. శనివారం ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉరుసు ఉత్సవాలకు కులమతాలకు అతీతంగా హిందూ ముస్లిం సోదరులు తమ మొక్కులను తీర్చుకుంటారని పేర్కొన్నారు. షహజాద్ బాబా హుస్సేన్ సాహెబ్, మొయినుద్దీన్ హుసేని అధ్వర్యంలో గంధం నిర్వహిస్తారన్నారు. అదే రోజు భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఉరుసు రోజు రాత్రి 9 గంటలకు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన టీవీ సింగర్ జునైద్ సుల్తాని, ముంబాయికి చెందిన టీవీ సింగర్ చోటి షబ్ నమ్, ఢిల్లీకి చెందిన టీవీ సింగర్ రయీస్ అనీస్ సంగీత గాయకులచే గంధం, ఉరుసు రెండు రోజులు గొప్ప ఖవ్వాలి పాటల పోటీ ఉంటుందని తెలిపారు. ఉరుసు ఉత్సవాలకు హిందూ ముస్లిం సోదరులందరూ తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని, ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి : గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

ఎమ్మెల్సీ ఎన్నికల విధులు పట్ల అధికారులు ప్రతిక్షణం అప్రమత్తంగా వ్యవహరిస్తూ పారదర్శకంగా పోలింగ్ ఘట్టం పూర్తిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గిరీష ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సింగిల్ విండో సిస్టం ఏర్పాటు, ఎంసిసి, బందోబస్తు, తదితర ప్రక్రియలపై జిల్లా ఎన్నికల అధికారి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ సభలు, ర్యాలీలు, వాహనాల అనుమతులకు జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో సిస్టం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో టాయిలెట్, డ్రింకింగ్ వాటర్, ర్యాంపులు, విద్యుత్ కనీస సదుపాయాలు కచ్చితంగా ఉండాలన్నారు. ఫ్యాన్లు అన్ని పని చేసేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎఎస్‌పిని ఆదేశించారు. అందులో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్, స్ట్రైకింగ్ ఫోర్స్, మొబైల్ పార్టీ, పోలీస్ బందోబస్తు సిద్ధం చేయాలన్నారు. ప్రతి సెక్టార్‌కూ మొబైల్ పార్టీ, ఫ్లయింగ్ స్క్వాడ్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాత్కాలిక స్ట్రాంగ్ రూమును ఏర్పాటుచేసి వీడియో రికార్డింగ్ చేయించాలన్నారు. పోలీస్ విధులలో పాల్గొనే వారికి పోస్టల్ బ్యాలెట్ ఫామ్ 12 ఇవ్వాలని సూచించారు. ఎంసిసి వైలేషన్ చేస్తే వెంటనే ఎఫ్ఐఆర్ ఫైల్ చేయాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్లకు ఈ నెల ఎనిమిదో తేదీన శిక్షణ ఉంటుందన్నారు. 9న ప్రిసైడింగ్ అధికారులకు రెండో విడత శిక్షణ ఉంటుందన్నారు. ఎక్కడ మ్యాన్ పవర్ సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సంబంధితాధికారిని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ తప్పకుండా చేయించాలని డిపిఒను ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు పనిచేస్తున్నాయో లేదో రెండు, మూడు సార్లు చెక్ చేసుకుని తీసుకువెళ్లాలా చూడాలన్నారు. ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బందికి శిక్షణ క్షుణ్ణంగా ఇవ్వాలన్నారు. ట్రాన్స్‌పోర్టు మేనేజ్మెంట్‌కు సంబంధించి ఏపీఎస్ఆర్టీసీ బస్సులను తీసుకోవాలని డిటిసిని ఆదేశించారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, ఎఎస్‌పి రాజ్ కమల్, డిఆర్ఒ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లె ఆర్‌డిఒలు రంగస్వామి, మురళీ, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

'ఆడపిల్ల ఆలోచనలకు అక్షరం ఆసరా కావాలి'

ప్రజాశక్తి-పీలేరు

ఆడబిడ్డ జన్మించేది సంపూర్ణంగా జీవించడానికేనని, వారి విద్య, ఆహారం పట్ల శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. గురువారం పీలేరు ఎపి గురుకుల బాలికల ఉన్నత పాఠశాలలో 'ఆడశిశువును కాపాడుదాం-సృష్టిని రక్షిద్దాం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆడబిడ్డ సంక్షేమం దృష్ట్యా 1 నుండి 8వ తేదీ వరకు జరిగే ప్రత్యేక కార్యక్రమాల్లో గర్భస్థ పిండం ఆడబిడ్డ అని తెలియగనే గర్భస్థ హత్యకు పాల్పడ్డం కేవలం ఆ కుటుంభానికే కాకుండా సమాజ మొత్తానికీ తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. నేడు బాలిక సంక్షేమం, ఆరోగ్యం, విద్య, సామాజిక అంశాలపై సంపూర్ణంగా అవగాహన పొందాల్సిన అవసరం అందరికీ ఉందని, ఇది ప్రతి ఆడబిడ్డ నైతిక బాధ్యతని చెప్పారు. సమాజములో నేడు జరుగుతున్న మంచి, చెడు సమ్మేళనం నుంచి మంచిని గ్రహించి మసలుకునే నైపుణ్యం ప్రతి ఆడబిడ్డకూ అవసరమని తెలియజేశారు. అందుకు మంచి ఆరోగ్యం, సమయస్ఫూర్తి, కష్టంతో కాకుండా ఇష్టపడి చదివే నైపుణ్యం, కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఆతృత, క్రమశిక్షణ కచ్చితంగా కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఇప్పుడు మనం ఆడపిల్లను వద్దనుకుంటే రేపు మన సమాజం అమ్మలేని అనాథ అవుతుందని, విజ్ఞానం అందరి వంతు కావాలని, ఇటు సమాజానికి, అటు కుటుంబానికీ బాలిక ఒక ఆణిముత్యమన్నారు. ప్రతి ఒక్కరం కుటుంబ, సమాజ శ్రేయస్సు, దేశ భవిష్యత్తు దృష్ట్యా ఆడబిడ్డను పుట్టనిద్దాం, ఎదగనిద్దాం, చదవనిద్దాం, గౌరవిద్దామని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ప్రిన్సిపల్ పిహెచ్ఎన్ వెంకటసుబ్బమ్మ, పర్యవేక్షకులు కృష్ణయ్య, అక్కయ్య, ఎఎన్ఎం పాముమన్నీసా, సిహెచ్ఒ లావణ్య, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుప్త నిధుల తవ్వకాల గుట్టు తేల్చాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలం సిటిఎం గ్రామం బొమ్మకొండ సమీపంలో గంగమ్మపేడు పైన గుప్త నిధులు తవ్వకాల గుట్టును అధికారులు తేల్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుప్త నిధులు కోసం కాదు ధ్వజ స్తంభం కోసం జరిగిందని సిటిఎం సర్పంచ్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సర్పంచ్ కనుసన్నల్లోనే గుప్త నిధులు వేట జరిగి ఉంటుందని విమర్శించారు. 50 అడుగుల పైగా సారవ కొయ్యలతో నిచ్చెన చేసుకుని గుండు పైకి చేరుకుని తూటాలు ఉపయోగించి నాట్లు పెట్టడం ఆషామాషి కాదని, అధికారులు, నాయకుల అండదండలతో జరిగిందని తెలిపారు. రెవెన్యూ, ఫారెస్ట్, పోలీసు, మైనింగ్ అధికారులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కలెక్టర్ జోక్యం చేసుకొని గుప్త నిధులపై సమగ్ర విచారణ జరిపించాలని, అందుకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపి అధిక ఆదాయం పొందాలని ప్రకృతి సాగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ అన్నారు. గురువారం మండలంలోని అయ్యవారిపల్లిలో రైతు హేమలత తనకు ఉన్న ఎకరం పొలంలో ఏ గ్రేడ్ మోడల్‌లో టమోటా, బీన్స్, పెసర, మిరప, ఉల్లి, సపోటా, ఆముదం, వంగ, బంతి, బెండ, జామ, మొటిక, అరటి, కొబ్బరి, ముల్లంగి, కమల, దానిమ్మ, కాకర, సొర, చీన, నిమ్మ, అంజీరా, గ్రీన్ ఆపిల్, రెడ్ ఆపిల్, దంటాకు, గోంగూర, బీర సాగును పరిశీలించారు. ప్రకృతి సాగులో చేపట్టాల్సిన మెలికలు, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏ గ్రేడ్ మోడల్‌లో అంతర్ పంటలు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. 360 రోజుల పాటు దిగుబడులు, ఆదాయం గురించి రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఎల్ 2 స్వాతి, సిబ్బంది శ్రీనివాసులు, రెడ్డిబాషా, పెద్ద రెడ్డెయ్య పాల్గొన్నారు.

కండక్టర్ నిజాయితీ

- దొరికిన సెల్ ఫోన్ ప్రయాణికుడికి అప్పగింత

ప్రజాశక్తి-పీలేరు

కండక్టర్ తనకు దొరికిన సెల్ ఫోన్ ప్రయాణీకుడికి అప్పగించి నిజాయితీ చాటుకున్న సంఘటన పీలేరులో జరిగింది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని సంబేపల్లి మండలం, మోటకట్ల గ్రామానికి చెందిన పూజల కాటం రాజు బుధవారం ఉదయం పీలేరు ప్రజా రవాణా సంస్థ డిపో బస్సులో సంబేపల్లి నుండి తిరుపతికి ప్రయాణిస్తూ సెల్ ఫోన్ బస్సులో పోగొట్టుకున్నాడు. విధి నిర్వహణలో ఉన్న పీలేరు డిపో కండక్టర్ వెంకటరమణ తనకు దొరికిన సెల్ ఫోన్‌ను బస్టాండ్‌లో విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ ఎం. ఆదినారాయణకు సమాచారం అందించాడు. సెల్ ఫోన్ పోగొట్టుకున్న కాటంరాజును పీలేరు బస్టాండుకు పిలిపించి గురువారం కంట్రోలర్ సత్య నారాయణ, బస్టాండ్ బుక్ స్టాల్ ఓనర్ పసుపులేటి వెంకటరమణ సమక్షంలో రూ.15 వేలు విలువగల సెల్‌ఫోన్‌ను కాటంరాజుకు అప్పగించారు. ఈ సందర్భంగా కండక్టర్ వెంకటరమణ నిజాయితీని పలువురు ప్రశంసించారు.



బాధితుడికి సెల్ ఫోన్ అప్పగిస్తున్న కండక్టర్


పశువుకు టీకాలు వేస్తున్న పశు వైద్యసిబ్బంది

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని మట్లి పంచాయతీలో పెద్దురు కాస్పాలో గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సోమారపు నాగార్జునచారి ఆధ్వర్యాన పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు గురువారం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు తమ పశువులకు ముందస్తుగా పశువైద్యుల సలహాలు ప్రకారం టీకాలు వేయించాలన్నారు. తద్వారా పశువులను వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చు అన్నారు. మానవ సమాజానికి పశుసంపద ఎన్నో విధాలుగా సహాయపడుతున్నాయని అన్నారు. పశువుల గుర్తింపు కోసం చెవిపోగు వేయించడం ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. పశు వైద్యులు డాక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో పరిసరాలు, వాతావరణం కలుషితం అవుతుందని, తద్వారా పశువులకు వ్యాధులు సంక్రమిస్తాయని పేర్కొన్నారు. వైరస్ ప్రభావంతో గాలికుంటు వ్యాధి అక్టోబరు నెలలో సంక్రమిస్తుందని, నోరు, గిట్టల మధ్య బొబ్బలు నోటి నుంచి చొంగ కారడం ఈ వ్యాధి లక్షణాలు అని అన్నారు. ఈ వ్యాధి పశువులకు సోకితే పాల ఉత్పత్తి తగ్గుతుం దని చెప్పారు. రైతులందరూ పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. ఈనెల 11వ తేదీ వరకు ప్రతి గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో ఒక్క రోజు చొప్పున ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గుదె నాగభూషణం నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

గాయపడ్డ వ్యక్తికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గాలివీడు

కడప-రాయచోటి రోడ్డులోని గువ్వల చెరువు ఘాటులో జనవరి 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యను కోల్పోయి, తన కుడికాలు విరిగిపోయిన చంద్రమౌళి కుటుంబానికి గురువారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ రూ.30వేలు ఆర్థిక సాయం అందించింది. చంద్రమౌళి గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ ఉండేవాడని, ప్రమాదంలో భార్యను కోల్పోయి, కుడికాలు విరిగి పోవడంతో జీవనోపాధితో ఇబ్బందులు పడుతున్నాడని అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కోశాధికారి శివయ్య, అధ్యక్షుడు రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు గోపాల్, జిల్లా అధ్యక్షులు ప్రసాద్‌యాదవ్, సాయియాదవ్, చైర్మన్ బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఆర్థికసాయం చేశామన్నారు. కార్యక్రమంలో మానవతా సభ్యులు సామనర్సింహారెడ్డి, రాజారెడ్డి, బాలాజీరెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

9 నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు

గాలివీడు : ఈనెల 9 నుంచి 20వ తేదీ వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ చెక్రె నాయక్ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారము అన్ని పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు నిర్వహించబడతాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో ఉన్న ప్రతి ఒక్క ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ పరీక్షల షెడ్యూల్ అమలు చేయాలని తెలిపారు.

బాలికల సంరక్షణకు ప్రాధాన్యత

ప్రజాశక్తి- కంభంవారిపల్లి

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని వగళ్ళ గ్రామంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ రేష్మ పాఠశాలలోని బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. చిరువ్యాధులకు చికిత్స నందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో డాక్టర్ మాట్లాడుతూ బాలికల సంరక్షణ పట్ల ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. బాలికలందరూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ల పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏదైనా ఇబ్బందులు ఎదురైతే సమస్యను రాసి పాఠశాల నందు ఏర్పాటు చేసిన ఫిర్యాదు పెట్టెలో వేయాలని సూచించారు. రక్తహీనత నివారణ, పౌష్టికాహార ఆవశ్యకత గురించి వివరించారు. బాలికల వివాహ నిర్మూలన, సరైన వివాహ వయస్సు, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టము గురించి అవగాహన విద్యార్థినిలకు కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శ్రావణి, పబ్లిక్ హెల్త్ నర్స్ రమాదేవి, ఆరోగ్య విస్తరణ అధికారులు కృష్ణమ్మ, కృష్ణయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లోకేశ్వరి, స్టాఫ్‌నర్స్ సులోచన, ఆరోగ్య సహాయకులు వెంకటరమణ, అలేఖ్య, ఆశా కార్యకర్త ధనలక్ష్మి పాఠశాల ఉపాధ్యాయునులు పాల్గొన్నారు.

పిల్లల చదువులపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి-నందలూరు

పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు బాగా చదువుకునేలా ప్రోత్సహించి, శ్రద్ధ వహించాలని ఎంఇఒ గంగిరెడ్డి కోరారు. నైట్ విజన్ కార్యక్రమంలో భాగంగా నాగిరెడ్డి పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్ల వద్దకు ఉపాధ్యాయులతో వెళ్లి తల్లిదండ్రులకు సలహాలు, సూచనలు అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు పూర్తయ్యేంతవరకు టివిలను కట్టిపెట్టాలని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధర్, ఖాజా హుస్సేన్, చాన్‌భాష, చంద్రకాంత్, స్వర్ణలత, గౌరీ, రమణమ్మ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులను ఆదుకోండి

ప్రజాశక్తి-పుల్లంపేట


పుల్లంపేట : టిబి రోగులకు పౌష్టికాహారం అందిస్తున్న ఎంపిపి

క్షయ వ్యాధితో బాధపడుతున్న పేద రోగులను మానవత దృక్పథంతో ప్రతి ఒక్కరు ముందుకొచ్చి దత్తత తీసుకోవాలని ఆదుకోవాలని ఎంపిపి ముద్దాబాబుల్‌రెడ్డి అధికారులను కోరారు. గురువారం నాడు టిబి ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా మండల స్థానిక ఆరోగ్య కేంద్రం నందు ఎంపిపి మాట్లాడుతూ పేద క్షయ రోగులకు పౌష్టిక ఆహారం అందించడానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మానవత దృక్పథంతో అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు ఒకరి చొప్పున తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ శైలజ, డివిజినల్ ఉప వైద్యాధికారి డాక్టర్ చిన్ని కృష్ణ, తాహశీల్దార్ నరసింహా కుమార్, ఎంపిడిఒ ప్రకాశం, ఎంఇఒ రంగనాథయ్య, డాక్టర్ సానే శేఖర్, డాక్టర్ మనోజ్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజా, టిబి సూపర్వైజర్ పి.ప్రకాశ్, హరహరమ్మ, సూపర్వైజర్లు వి.కుమారి, పిల్లి పిచ్చయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **కలికిరి :** మానవత దృక్పథంతో క్షయ వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలని ఎంపిడిఒ గంగయ్య దాతలను కోరారు. ప్రధానమంత్రి టిబి ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా వై.నాగిరెడ్డి ఆధ్వర్యంలో టిబి రోగుల దత్తత తీసుకోవాలని ఎంపిడిఒ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా తహశీల్దార్ భాగ్యలత ఒకరిని, కలికిరి పంచాయతీ సర్పంచ్ ప్రతాప్ కుమార్ రెడ్డి నలుగురుని, పద్మాదే హాస్పిటల్ ఆధ్వర్యంలో 20 మంది టిబి రోగులను గుర్తించి వారిని దత్తత తీసుకున్నారు. వారికి నెలకు రూ.700 అందించి మెరుగైన పోషక విలువలు కలిగిన ఆహారం అందించడానికి ఆ నగదు ఉపయోగిస్తామని ఆయన తెలిపారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి వారికి తగు సహాయం చేయవలసిందిగా కోరారు. **కంభంవారిపల్లి :** టిబి వ్యాధి నివారణ వారోత్సవాలు సందర్భంగా పీలేరు టిబి యూనిట్ క్షయ నివారణ వైద్యధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, జిల్లెల్ల మంద పిహెచ్‌సి వైద్య ధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డిల ఆధ్వర్యంలో నూతన కాల్వ చిన్నకంబిరెడ్డిగారిపల్లి జిల్లాపరిషత్ హై స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతు టిబి వ్యాధి గాలి ద్వారా వ్యాప్తి చెందే అంటువ్యాధి అని అన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి, గళ్లలో రక్తం పడటం టిబి వ్యాధి లక్షణాలని అన్నారు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళితే ఉచితంగా గళ్ళ పరీక్ష చేసి, మందులు ఇస్తారని తెలిపారు. కార్యక్రమానికి చేయూతనిచ్చిన దాతలు వెంకటరమణరెడ్డి, వైసిపి మండల కన్వీనర్, మారెళ్ల సర్పంచ్ మధు సుధన్‌రెడ్డి, మంచాల మంద సర్పంచ్ వారాదమ్మ, సాహిత్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టిబి సూపర్వైజర్ మోహన్, పవన్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పి, సిహెచ్‌ఒ ప్రతిభ, ఆరోగ్యకార్యకర్త శశికళ, ఆశ కార్యకర్తలు నాగజ్యోతి, కళావతి, సుమాంజలి పాల్గొన్నారు.

టిడిపిలో చేరనున్న సర్పంచ్ ప్రతాప్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి


సర్పంచ్ ప్రతాప్ కుమార్‌రెడ్డి

ఈనెల 6న తెలుగు దేశం పార్టీలో చేరుతున్నట్లు కలికిరి మేజర్ పంచాయతీ వైసిపి సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఈనెల 6న సోమవారం కలికిరికి చేరుకున్న సందర్భంగా ఆయన సమక్షంలో టిడిపిలో చేరనున్నట్లు తెలిపారు. గత కొన్నేళ్లుగా ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి అండగా నిలిచి రాజకీయంగా బలమైన నల్లారి కుటుంబానికి ఎదురొడ్డి ఆయన విజయానికి సహకరించామని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నాలాంటి కష్టపడి పనిచేసిన వారిని గుర్తించక పోవడం బాధాకరమని అన్నారు. కొత్తగా చేరిన వారికి ప్రాధాన్యమిచ్చి తమను దూరం చేయడం వల్లే వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరుతున్నట్లు స్పష్టం చేశారు. నాతో పాటు నాయకులు, కార్యకర్తలు టిడిపిలో చేరాలని పిలుపునిచ్చారు.

పోలీస్ స్టేషన్‌కు బ్లూకోల్ట్ ద్విచక్ర వాహనాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణ ప్రజల భద్రత దృష్ట్యా ఎస్‌పి హర్ష వర్ధన్‌రాజు ఆదేశాల మేరకు అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు రెండు నూతన బ్లూకోల్ట్ ద్విచక్ర వాహనాలు మంజూరు అయ్యా యని అర్బన్ సిఐ నరసింహారావు తెలిపారు. డిఎస్‌పి శివభాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ వాహనాలను వినియోగించుకొని పట్టణంలో గస్తీ ముమ్మరం చేస్తామని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. బెట్టింగ్, మట్కా, గుట్కా రవాణా పై నిరంతరం నిఘా ఉంచుతామని తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

నియోజకవర్గంలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్‌డిఒ మురళి హెచ్చరించారు. బుధవారం ఆయన తంబళ్లపల్లె లోని 301 పోలింగ్ కేంద్రాలను అధికారులతో కలసి పరిశీలించారు. ఎన్నికలకు సంబంధించి ప్రోటోకాల్ నిర్వహణలో అధికారుల ముందస్తు చర్యలు బాగున్నాయని ప్రశంసించారు. ఆర్‌డిఒ వెంటన తహశీల్దార్ కళావతి, ఎంపిడిఒ, ఆనంద్ కుమార్, ఎంఇఒ త్యాగరాజు, ఎస్ఐ రామకృష్ణారెడ్డి, ఆర్ఐ రవి, విఆర్‌ఒలు శ్రీరాములు, రమణ, సిబ్బంది పాల్గొన్నారు. **ములకలచెరువు :** ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్డిఒ మురళి సూచించారు. గురువారం స్థానిక నాయుని చెరువుపల్లె రోడ్డులోని ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే పట్టభద్రులకు గాలి, నీరు, వెలుతులు అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. అనంతరం పోలింగ్ స్టేషన్ల పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట తహసిల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ అశ్వని, ఎంఈఓ వెంకటరమణ, ఎమ్మెల్సీ ఎన్నికల అధికారి శ్రీహరి, ఆర్ డబ్ల్యుఎస్ అధికారి బాలచంద్రాచారి, ఎఎస్ఐ నజీర్ ఉన్నారు. **పెద్దమండ్యం :** పట్టభద్రుల, టీచర్, ఎమ్మెల్సీ కేంద్రాన్ని ఆర్‌డిఒ మురళి పరిశీలించారు. తహశీల్దార్ నిర్మాలదేవి మండలంలో 728 మందిపట్టభద్రులు ,14మంది టీచర్ ఓట్లు ఉన్నట్లు ఆయనకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్‌రావు, ఎస్ఐ వెంకటేష్, డిటి వెంకటేష్ గౌరీశంకర్, అధికారులు పాల్గొన్నారు.

ఇందుకూరుపల్లిలో చెక్‌పోస్టు ఏర్పాటు

ప్రజాశక్తి-గాలివీడు

ఈనెల 13న జరిగే గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా వెలిగల్లు, ఇందుకూరు వారిపల్లి వద్ద గురువారం చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు ఎఎస్‌ఐ రఘురామయ్య తెలిపారు. ఈ చెక్‌పోస్ట్ వద్ద ఒక ఎఎస్‌ఐ, కానిస్టేబుల్ , హోంగార్డును నియమించినట్లు ఆయన తెలిపారు. ఇతర జిల్లాల నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా వచ్చే వాహనాలను వస్తే నిరోధిస్తామని పేర్కొన్నారు.

ఆదర్శ పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని ఆదర్శ పాఠశాలను గురువారం బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ ఎం.లక్ష్మీదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విడివిడిగా సమావేశం ఏర్పాటు చేశారు. బాలల హక్కుల గురించి విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులకు సమాజంలో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్యామలాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలో అప్పయ్యరాజుపేట ఎంపియుపి పాఠశాలను స్థానిక ఉప సర్పంచ్ సయ్యద్ ముస్తాక్ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను, వంటశాలను, మరుగుదొడ్లను చుట్టుపక్కల పరిసరాల పరిశుభ్రత గురించి ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అందించాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తిన తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థుల విషయంలో ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


మల్లూరమ్మను దర్శించుకుంటున్న వీరాంజనేయప్రసాద్

మల్లూరమ్మ సేవలో 'మోడెం'

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలం కొత్తపల్లి పంచాయతీ మల్లూరమ్మ దేవాలయాన్ని ఆలయాన్ని రాష్ట్ర తొగటవీర క్షత్రియ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోడం వీరాంజనేయ ప్రసాద్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7 పౌర్ణమి రోజున జరిగే జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శనం చేసుకుని ప్రతి ఒక్కరూ అన్న ప్రసాదాలు స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కె విజయభాస్కర్, బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు అమ్మవారు యుగంధర, ఒకటి సంగం తొగట సంఘం నాయకులు రామచంద్రయ్య పాల్గొన్నారు.

'పది' పరీక్షలంటే భయమెందుకు ?

వీరబల్లి : పదవ తరగతి పరీక్షలంటే భయమెందుకని, అనవసరమైన భయాలను పెంచుకొని ఒత్తిడికి లోనైతే అది చెడే తప్ప మంచి చేయదని డాక్టర్ వినయ్‌బాబు, విఆర్‌డిఎస్ సురేంద్రారెడ్డి పేర్కొన్నారు. విఆర్‌డిఎస్ సంస్థ ఆధ్వర్యంలో కస్తూరిభా గురుకుల పాఠశాలలో పరీక్షలంటే భయమెందుకు అనే అంశంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయంలో ప్రశాంతంగా ఉంటే చదివినవి గుర్తుండడమే కాకుండా మంచి మార్కులు సాధించవచ్చు అన్నారు. అంగన్వాడీ సిడిపిఒ పద్మజ మాట్లాడుతూ పరీక్షలంటే భయం పోయి సానుకూల దృక్పథం అలవర్చుకోవాలంటే అసలు సమస్యకి మూలం ఎక్కడో తెలుసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ సుధాకర్, ఆస్పత్రి సిబ్బంది, అంగన్వాడీ సూపర్వైజర్ సుజాత, కస్తూరిభా ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కుసుమ పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నివారించే బ్యాటరీ సైకిల్ ఏర్పాటు

ప్రజాశక్తి-కురబలకోట

మండలంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై ఆటో సైకిల్‌ను తయారు చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ పేర్కొన్నారు. ఈ సైకిల్‌ను విభిన్న ప్రతిభావంతుల కొరకు ఉంచినట్లు పేర్కొన్నారు. వాతావరణ కాలుష్యం రోజు రోజుకు పెరుగుతోందని, వాహనాలు వదిలే కాలుష్య ఉద్గారాలతో ప్రకృతి మొత్తం కలుషితమవుతోందని అన్నారు. ఇంధన ధరలు పెరిగి పోయి ప్రజలు బెంబెలెత్తిపోతున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విస్తీర్ణం ఎక్కువగా ఉన్న ఫ్యాక్టరీలు, పెద్దపెద్ద సంస్థల్లో తిరిగేందుకు బ్యాటరీ ఆపరేటెడ్ వాహనాలు వినియోగించాలంటే చాలా ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. మెకానికల్ విభాగం ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఎంవి.సునీల్, ఆర్.రూపేంద్ర, ఎస్.పృధ్వీరాజ్, డి.ముస్కాన్పల్లి, ఎన్. అఖిల్‌లు బృందంగా ఏర్పడి గైడ్ అధ్యాపకులు ఆచార్య లక్ష్మణరావు, హేమానందన్, రాంమోహన్ నాయుడు బ్యాటరీ ఆపరేటెడ్ ఆటో సైకిల్‌ను తయారు చేశారని తెలిపారు.


బ్యాటరీ సైకిల్‌తో మిట్స్ విద్యార్థి


సహస్విని అభినందిస్తున్న ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్‌ఎస్ రోడ్డు లో గల శ్రీ చైతన్య పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్న డి.సహస్వి ఇటీవల తమిళనాడులోని రాజాయపాలెం పట్టణంలో నిర్వహించిన 19వ జాతీయస్థాయి సిలబం (కర్రసాము) పోటీలలో మినీ సబ్ జూనియర్స్ విభాగంలో రజక పతకం సాధించిందని ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో విద్యార్థినికి అభినందన సభ ఏర్పాటు చేశారు. పాఠశాల ఎజిఎం రమణయ్య సహస్విని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో ప్రతి ఒక్కరికి వ్యాయామం, ఆత్మరక్షణ విద్యలు ఎంతో అవసరమని అన్నారు. భారతదేశ సంప్రదాయ కళ అయిన కర్ర సాము పోటీలలో తమ విద్యార్థిని జాతీయస్థాయిలో రాణించడం గర్వించదగ్గ విషయమని అన్నారు. సహస్విని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు క్రీడలలో కూడా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అనూష, పాఠశాల డీన్ వెంకటసుబ్బయ్య, సిబ్యాచ్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, కస్తూరి, పిఇటిలు చంద్రశేఖర్, శాబు పాల్గొన్నారు.


రమేష్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

వైసిపి ప్రభుత్వంలో బిసిలకు అన్యాయం : ఆర్ఆర్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

వైసిపి ప్రభుత్వంలో బిసిల నిధులన్నీ ఇతర పథకాలకు పంపిణీ చేసి బిసిలకు అన్యాయం చేశారని నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం దప్పేపల్లి పంచాయతీలోని వీరారెడ్డిగారిపల్లి, చిన్ననాగిరెడ్డిగారిపల్లి జాండ్రపల్లి వల్లూరువాండ్లపల్లి, కొండవాండ్లపల్లి, గొల్లపల్లి, వేములవాళ్లపల్లి, డి.రామపురం, తురకపల్లి గ్రామాలలో నిర్వహించిన ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని వైసిపి ప్రభుత్వం అన్ని విధాల నాశనం చేసిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల నిధులన్నీ ఇతర పథకాలకు ఖర్చుచేసి మోసం చేశారని అన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన అంతమొందించి టిడిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి, కాలాడి ప్రభాకర్‌రెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి వసంత రవిశంకర్ రెడ్డి, సర్పంచ్ కేశవయ్య, మూగి శ్రీరాములు పాల్గొన్నారు.

రైలు ఢీకొని పీలేరు వాసి అమెరికాలో మృతి

ప్రజాశక్తి-పీలేరు

రైలు ఢీకొని పీలేరు వాసి అమెరికాలో మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. బంధువుల కథనం మేరకు అమెరికాలోని న్యూజెర్సీ నగరంలో పీలేరుకు చెందిన శ్రీకాంత్ రాజు (40) సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. విశ్రాంత ఆర్మీ ఉద్యోగి విజయ్‌కుమార్‌రాజు, సరళ దంతపుల కుమారుడైన శ్రీకాంత్ రాజు గత ఆరేళ్లుగా అమెరికాలో పనిచేస్తున్నాడు. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం అతను రోజూలాగే తన ఇంటి నుంచి కార్యాలయానికి వెళ్లేందుకు అక్కడి లోకల్ రైల్వేస్టేషన్ కు వెళ్ళాడు. ఈ సందర్భంగా అతన్ని రైలు ఢీకొని మరణించినట్లు అతని మిత్రులు మంగళవారం రాత్రి బంధువులకు సమాచారం అందించారు. అయితే అతని మృతికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. వారు కూడా న్యూజెర్సీలోనే ఉంటున్నారు. శ్రీకాంత్ రాజు మృతి చెందిన విషయం తెలిసి అతని కుటుంబంలో విషాదం నిండుకుంది.

క్రైం కార్నర్


నగదును స్వాధీనం చేసుకున్న సిఐ నరసింహారావు

వాహన తనిఖీల్లో రూ.30 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వాహన తనిఖీల్లో సరియైన పత్రాలు లేని రూ.30లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సిఐ నరసింహారావు తెలిపారు. సిఐ తెలిపిన వివరాల మేరకు.. ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తో గురువారం తనిఖీలు చేపట్టామని తెలిపారు. పోలి చెరువు కట్ట మీద టిఎన్05సిసి7799 అనే నెంబర్ గల కారులో చెన్నైకు చెందిన వెంకటరమణ మరో ముగ్గురితో రాజంపేటకు చెందిన ఓ వ్యక్తి వద్ద స్థలం కొనేందుకు రూ.30 లక్షలు నగదు తీసుకుని వెళుతుండగా తనిఖీలలో గుర్తించి సరైన పత్రాలు లేనందున స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పంచనామా నిర్వహించి నగదును ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్లు సిఐ తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ : ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని ఆడపూరు గురుకుల పాఠశాలలో గురువారం రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న ఘటనలో ఒక యువకుని కాలు విరిగగా,మరో యువకుని గాయాలయ్యాయి. పోత్తపి నుండి నందలూరుకు వస్తున్న గానం మహేష్‌యాదవ్, నందలూరు నుండి ఆడపూరుకు వెళ్తున్న జంగంశెట్టి సుబ్బరాయుడు ఆడపూర్ గురుకుల పాఠశాల వద్ద రెండు మోటార్ సైకిళ్ళు ఢీకొనడంతో మహేష్ యాదవ్‌కు కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులకు సమాచారం తెలియడంతో ఎఎస్ఐ సుబ్బరాయుడు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి గాయపడిన మహేష్ యాదవ్‌ను 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని గోపి దిన్నె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన కరవపల్లి నారాయణరెడ్డి(70) వృద్ధుడని సొంత తమ్ముడి కుమారుడు నరేంద్ర రెడ్డి(37) బుధవారం ఉదయం బోరుబావి వద్ద పంటకు నీరు వదిలే విషయమై ఘర్షణ పడ్డారు. నరేంద్ర రెడ్డి బండ రాతితో వృద్ధుడు నారాయణరెడ్డి పై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందిన విషయం పాఠకులకు తెలిసిందే. గురువారం కొత్తపల్లి సమీప నల్లగుట్ట వద్ద నిందితుడిని నరేందర్ రెడ్డి ఉండగా మొలకలచెరువు సిఐ షాధిక్ ఆలీ, ఎస్ఐ రామకృష్ణారెడ్డి అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.